

ఉదయం తొమ్మిది గంటలవుతుంది.

బజార్లన్నీ బహు రద్దీగా, సందడిగా వున్నాయి. 'బాలసదన్' వారి స్కూలు బస్సు వేగంగా స్కూలు వయిపుకుపోతుంది. ప్రతిరోజూ యిదే సమయంలో పెద్ద మార్కెట్టు, గవర్నమెంటు ఆసుపత్రి, లైబ్రరీ, చిన్న మార్కెట్టు, గంగానమ్మలగుడి మీదుగా ఆయా కూడలి స్థలాల్లో పిల్లల నెక్కించుకుని స్కూలు వయిపుగా పోతూ వుంటుంది

బస్సునిండా పిల్లలున్నారు — వాళ్ల వాళ్ల తల్లిదండ్రులు కనే సుందర స్వప్నాలకు ప్రతిరూపాలుగా, ఆకాశం కడుపులోంచి జారి నేలవయిపుకు ప్రయాణిస్తున్న వాన చినుకుల్లోని స్వచ్ఛత కల లేవటి పౌరులు వాళ్లు!

బస్సు చిన్నమార్కెట్టు దాటి గంగానమ్మ గుడిమీదుగా స్కూలు వయిపుకు పోతోంది. రోజూ ఆ గంగానమ్మగుడి దగ్గర ఆగుతుంది. రోజూ బస్సు వచ్చే టైంకు గోపి పుస్తకాలు పట్టుకుని గుడి ముందు నిలబడి వుంటాడు. వాళ్ల యిల్లు గుడికి కుడిప్రక్క సందులోవుంది. గోపి ఆ బస్సు డ్రైవర్ సీతయ్య కొడుకు. తొమ్మిదేళ్లవాడు. 'బాలసదన్'లో ఐదవ తరగతి చదువుతున్నాడు.

ఇవ్వాళ్ల బస్సు మామూలు ప్రకారం గంగానమ్మ గుడి ముందు ఆగకుండా రయ్ మని ముందుకు దూసుకుపోయింది. గుడిముందు గోపి పుస్తకాలు పట్టుకుని నిలబడ్డాడు. డ్రైవర్ సీతయ్య కనీసం అసలు గుడివయిపు చూడకుండా బస్సును ముందుకు పోనిచ్చాడు.

బస్సులోని పిల్లలంతా 'సీతయ్య, ఆపు ఆపు మీ గోపీ ఎక్కాలిగా! ఆపకుండా పోతున్నావేం?' అని గోలగోలగా అరిచారు.

సీతయ్య పిల్లలమాటలు పట్టించుకోలేదు. అసలు వినన్నట్లే వూరుకున్నాడు. బయ్‌బయ్‌మని హారను మ్రోగించుకుంటూ ముందుకు సాగిపోయాడు.

తనకోసం ఆగకుండా పోతున్న బస్సు వంక దిగాలుపడి చూస్తున్న గోపిని చూచి పిల్లలంతా చేతులూపి 'గోపి, గోపి' అని పిలిచారు. గోపి బస్సులో లేక పోయేసరికి మిగలా పిల్లలెవరికీ సందడే లేదు గోపి ఎప్పుడూ హుషారుగా నవ్వుతూ, మిగతా పిల్లలను నవ్విస్తూ వుంటాడు. వాడు నవ్వినప్పుడల్లా వాడి తొర్రిపన్ను బయటబడి చూచేవాళ్లకు అదొక సరదాగా వుంటుంది. అందుకనే మిగతా పిల్లలు వాడ్ని ఏదో ఒకటని వూరికే నవ్విస్తూ వుంటారు. గోపి బొద్దుగా అందరికీ ముద్దు వచ్చేటట్లుగా వుంటాడు వాడు వుత్త వసపిట్ట ఎప్పుడూ ఏవేవో కబుర్లు చెప్తూనే వుంటాడు. వాడు యింటిదగ్గర రెండు కుక్కపిల్లల్ని పెంచుతూ వున్నాడు. వాటికి వాడు 'చిన్ని పొన్ని' అని ముద్దు పేర్లు పెట్టుకున్నాడు. రోజూ బస్సులో ఎక్కీ ఎక్కగానే తన కుక్కపిల్లల కబుర్లు మొదలుపెడ్తాడు. అవి రోజూ రాత్రుళ్లు వాళ్ల ప్రక్కింటి షావుకారు చెంగయ్య పక్కలో పండుకోవటం, ఒక రాత్రికాడ షావుకారు లేచి భయంతో కేక వెయ్యటం, అవి వాళ్ల యింటిముందు పునుగులమ్మే మామ్మ తట్టలోని పునుగు లెత్తుకుని రావటం, అవి తనతో ఆడే ఆటలు— ఇలా ఎన్నెన్ని కబుర్లో విసుగూ విరామం లేకుండా చెప్తుంటాడు మిగతా పిల్లలంతా వాడు చెప్పే కుక్కపిల్లల కబుర్లను చెవులను రిక్కపొడ్చుకుని మరీ వింటారు. వాడు చెప్పే సంగతులను మళ్లీ మళ్లీ అడిగి చెప్పించుకుంటారు. ఎప్పుడన్నా ఒకరోజు గోపి బడి మాని వేస్తే ఆరోజు ఆ పిల్లలందరికీ మహా దిగులుగా వుంటుంది. అలాంటిది ఈరోజు గోపి పుస్తకాలు పట్టుకుని రోడ్డుమీద నిలబడినా, వాళ్ల నాన్న సీతయ్య బస్సు

నాపకుండా రావటం— వాళ్ళందరికీ చెప్ప రాని ఆశ్చర్యాన్ని, ఒకవిధమైన నిరుత్సాహాన్ని, అలజడిని కలిగించింది. ఆవిషయం గురించి పిల్లలందరూ గోలగోలగా మాటాడుకుంటున్నారు.

ముందు సీట్లో కూర్చున్న ఏడవ తరగతి మోహన్, 'ఏం సీతయ్య, మీ గోపిని ఎక్కించుకోకుండా వచ్చేశావు?' అని అడిగాడు.

సీతయ్య నిర్లక్ష్యంగా, 'ఆడి మొగానికి చదువుకూడ దేనికిలే బాబు!' అని అన్నాడు.

డ్రైవరు వెనుక సీట్లో కూర్చున్న రాణి అనే అమ్మాయి 'ఏం, చదువు ఎందుకని వద్దు?' అని అడిగింది.

సీతయ్య వెనక్కి తిరిగి చూచి, 'ఎవరు? ఓహో రాణమ్మగారా! నీవేనా తల్లి, యింకా నీవు మాటాడలేదేం అని చూస్తున్నా' అని అన్నాడు, ఒకవిధమైన చెతురూ, చనువూ మిళితమైన ధోరణిలో.

రాణి ఏడవతరగతి చదువుతుంది. రాణికి పన్నెండేళ్ళుంటాయి ఆ బస్సులో వచ్చే పిల్లలందరిలోకి రాణియే పెద్దది. చాల మంచిపిల్ల. అందరితో కలుపుగోలుగా వుంటుంది. ఆ బస్సులో నాలుగు, అయిదేళ్ళ వయస్సు పిల్లల దగ్గర్నుంచీ వున్నారు.

బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తోసుకుని గోలచేయకుండా చూస్తూ, చిన్న పిల్లలు బస్సులోంచి చేతులు బయట పెట్టి బయటికి తొంగి చూస్తూవుంటే వాళ్ళను గద్దిస్తూ— రాణి వాళ్ళందరికి పెద్దగా, కాస్త అజమాయిషీగా వుంటుంది. పిల్లలంతా, 'రాణక్క, రాణక్క,' అని అంటూ, ఆ పిల్లంటె ప్రేమగా వుంటారు. ఆ పిల్ల తర్వాత యిందాకటి మోహన్. దాదాపు రాణి అంత వయస్సే వుంటుంది మా వుంటె ఒక సంవత్సరము తక్కువ వుంటుంది

రాణి వాళ్ళ నాన్నగారికి లారీల షెడ్డు వుంది. ఇదివరకెప్పుడో సీతయ్య ఆ షెడ్డులో వాళ్ళ నాన్నగారి దగ్గర పనిచేశాడు దాన్నిబట్టి రాణి అంటె సీతయ్యకు చనువెక్కువ. అందుకనే ఆ పిల్లతో చెతురాడుతూ వుంటాడు. సీతయ్య అంటె రాణికి కూడా చనువే! రాణి అనేకాదు, ఆ బస్సులో వచ్చే పిల్లలందరికీ సీతయ్యంటె చనువే! సీతయ్య ఆ బస్సు డ్రైవరుగా, వాళ్ళ 'కేర్‌టేకర్'గా వాళ్ళను అజమాయిషీ చేస్తూ అందరితో చనువుగా వుంటూ, ఆ మాటలు ఈ మాటలు అంటూ ఎప్పుడూ అందర్నీ నవ్విస్తూ వుంటాడు.

రాణి నవ్వుతూ, 'ఏం సీతయ్య, మీ గోపికి చదువెందుకని వద్దు?' అని మళ్ళీ అడిగింది.

'మీరంతా చదువుకుంటున్నారుగా తల్లి!'

'మేమంతా చదువుకుంటె మీ గోపికేం వస్తుంది?' అని లీల అనే అమ్మాయి తకీమని అడిగింది. లీల పొట్టిగా సిసింద్రి లాగా వుంటుంది.

'లాగిందిరా లా పాయింటు. ఎట్టయినా బాపనోళ్ళ బిడ్డయ్యే!' అని అన్నాడు సీతయ్య వెనక్కి తిర్గి చూచి నవ్వుతూ

'ఈ సీతయ్య మంచోడు కాదు!' అని అన్నారెవరో

'గోపి మంచోడు'

'ఏయ్, కమల, గోపి బడికెందుకు రావటంలా?'

'నాకేం తెలుసు?'

'అసలు ఈ సీతయ్య ఎందుకు బస్సు ఆపలేదు?'

'ఇవ్వాళ్ళ గోపి లేపోతే ఏ—మీ—బాగోలేదు.'

...పిల్లలంతా ఇలా గోపి లేని వెలితిని తలా ఒక విధంగా తలా ఒక మాట ద్వారా వ్యక్తపరుస్తున్నారు.

'మీ గోపి వాళ్ళ క్లాసులో అన్నిట్లో ఫస్టుగా చదువుతాడంట సీతయ్య!' రాణే మళ్ళి అంది.

'మొన్న క్లాసు పరీక్షల్లో అన్నిట్లో గోపికె ఫస్టు మార్కు వచ్చింది.' అయిదో తరగతి సుబ్బారావు అన్నాడు.

'లబ్బ అన్నిట్లో ఎక్కడొచ్చాయేంటి? సాంఘిక శాస్త్రంలో ఫస్టుమార్కు అన్నపూర్ణకు కదూ వచ్చింది—'

ఇంతలో బస్సు స్కూలుగేటు దాటి లోపలికి వచ్చి ఆగింది

సీతయ్య బస్సు యింజనాపి కిందకు దిగి వచ్చాడు పిల్లలు తోసుకుంటూ దిగుతుంటె, 'హూఁ— మెల్లగా ఒక్కొక్కరే దిగండి. ఏయమ్మా సెమీరాకుమారి ఏంటి అట్టా దూకుతున్నావు. అగాగు హో శాస్త్రుల్లు, అక్కడేం పారిపోవటం లేదులేవయ్యా! అంతా భోజనం టిఫిన్లు జాగ్రత్తగా పెట్టుకున్నారా?' అని అందర్నీ అజమాయిషి చేస్తున్నాడు.

పిల్లలు బిలబిల దిగుతున్నారు.

'మా చిట్టెమ్మ తల్లి ఏది?' అని అంటూ సీతయ్య తలఎత్తి బస్సులోకి తొంగి చూశాడు

'ఇదిగో మీ చిట్టెమ్మ!' అని ఎవరో అన్నారు.

'ఏది. మెల్లగా దిగమ్మా! అఁ— అఁ—' అని బస్సు దిగిన చిట్టెమ్మను ఎత్తుకున్నాడు.

చిట్టెమ్మ అన్న పిల్లకు నాలుగేళ్ళుంటాయి. బంగారపు బొమ్మలాగా ముద్దులు మూటకట్టుతూ వుంటుంది. సీతయ్యకు ఆపిల్ల అంటె తగని ప్రేమ. సీతయ్యకు ఆడపిల్లలు లేరు. అందుకని సీతయ్య ఆ బస్సులో వచ్చే ఆడపిల్లలంటె యిష్టంగా వుంటాడు. అందులో ఆ చిట్టెమ్మ అంటె మరినూ. రోజూ స్కూలుదగ్గర బస్సు దిగేటప్పుడూ, ఎక్కేటప్పుడూ చిట్టెమ్మను ఆప్యాయంగా ఎత్తుకుని కొద్దిసేపు ముద్దులాడుతాడు. ఎప్పుడైనా ఒకరోజు ఆపిల్ల బడి మానివేస్తే ఆరోజంతా సీతయ్యకు దిగులుగా వుంటుంది; ఏమిటో అంతా కొరతగా వుంటుంది

చిట్టెమ్మ మామూలుగా సీతయ్య చంక ఎక్కి కిలకిలా నవ్వి కిందకు దిగేటప్పుడు సీతయ్య మీసాలు పట్టుకుని గుంజి మరీ దిగుతుంది. సీతయ్య మనసారా నవ్వుకుంటాడు.

* * *

మర్నాడుకూడ సీతయ్య గంగానమ్మ గుడిదగ్గర గోపికోసం బస్సు నాపలేదు. బడి రాగానే పిల్లలంతా గోలగా, 'బస్సు ఆపు, సీతయ్య, బస్సాపు!' అని అరిచారు కాని సీతయ్య యింకా స్పీడెక్కువ చేసి బస్సు నాపకుండా ముందుగా పోనిచ్చాడు. పిల్లలందరికీ సీతయ్యమీద పట్టరాని కోపం వచ్చింది. పుస్తకాలు పట్టుకుని గోపున్నమీద నింబడి బస్సు

# సమ్మె

వంక దిగాలుపడి చూస్తున్న గోపిని చూడగానే వాళ్ల లేతగుండెలు వూరికే దిగులుపడి పోయాయి. అసలు సీతయ్య బస్సు నెందుకాపటంలేదో వాళ్ల కర్థం కాకుండా వుంది. గోపి చదువును అంత అర్థాంతరంగా ఎందుకు మానిపిస్తున్నాడో, గోపి చదువుకోవటమంటె సీతయ్య కెందుకంత కష్టమో ఆ చిన్న పిల్లలకు అంతుపట్టకుండా వుంది. సీతయ్యను అడుగుతుంటె ఆ వెధవకెందుకు చదువు అని అనటం మినహాయించి ఇంకేమీ చెప్పటం లేదు గోపి బడికి రాక పోవటంవల్ల అందరికీ దిగులుగా, నిరుత్సాహంగా వుంది. గోపి కుక్కపిల్లలు 'చిన్ని పొన్ని' సంగతులు అసలికే తెలియటంలేదు. రాణి అయితే సీతయ్యమీద ఎంత కోపంగా వుందో చెప్పటానికి వీలు లేదు.

మూడోరోజు గోపి అసలు గుడి ముందు కూడ కనిపించలేదు

రాణి సీతయ్యను, 'గోపి రోడ్డుమీద కూడ లేడేం?' అని దబాయించి అడిగింది.

'ఏమో ఎక్కడ చచ్చాడో! అడిగేవెన్ని యాణలు!' అని అన్నాడు విసుగ్గా.

ఇంతలో వెనుక సీట్లల్లో కూర్చున్న పిల్లలు కొంతమంది, ఏదో రహస్యం చెప్పటానికి రాణిని వెనక్కి రమ్మని సైగ చేశారు రాణి లేచి మెల్లగా వాళ్ల దగ్గర కెళ్లింది వాళ్లు ప్రక్కకు సర్దుకుని రాణి కూర్చోవటానికి చోటిచ్చారు

మంగతాయరు అనే పిల్ల రాణికి పెద్ద రహస్యం చెప్పబోతున్నట్లు మెల్లగా, 'రాణక్క, మరే ఈ సీతయ్య లేడు—రోజూ రాత్రిపూట సారా తాగుతాడంట!' అని అంది.

రాణి ఆశ్చర్యంగా, 'నిజమేనా?' అని అడిగింది.

రంగడనే పదేళ్ల కుర్రవాడు, 'వట్టు, నిజం!' అని అన్నాడు కుడి అరచేతిని నెత్తిమీద పెట్టుకుంటూ.

మళ్లీ మంగతాయారు 'సారా తాగి రోజూ గోపి అమ్మను చావు దెబ్బలు కొట్టుతాడంట. అసలు యింట్లోకి డబ్బులే యివ్వడంట. పాపం, గోపి వాళ్లమ్మ పుగాకు కంపెనీలోకి కూలికి పోయి తె కూలి డబ్బుల్తో యిల్లు జరపాలంట' అని అంది.

మళ్లీ ఎవరో అందుకున్నారు.

'వారం రోజుల్నుంచి గోపి అమ్మకు జొరం అంట. పనికి పోవటం లేదంట. మొన్న రాత్రి బియ్యం లేక అన్నం వండలేదంట. ఈ సీతయ్య బాగా తాగొచ్చి ఏంవే అన్నం వండలేవా, రొయ్యల పులుసు పెట్టలేదా అని వాళ్లమ్మను పట్టుకుని కొట్టాడంట.'

'అంత జొరంలో వున్నదాన్నే?'

'ఆఁ— బాగా తాగి వున్నాడుగా — జొరంగా వుంటేనేం? ఒక దుడ్డుకర్ర తీసుకుని యిష్టం వచ్చినట్లు కొట్టాడంట'

మధ్యలో రంగడందుకొన్నాడు: 'అబ్బ నేను చెప్పుతా వుండు అప్పుడు మన గోపీగాడు రోకలిబండ తీసుకొని మా అమ్మని కొట్టుతావా అని సీతయ్య మీద కెళ్లాడంట నీవు నన్ను కొట్టే వాడివా వెధవా అని గోపీగాడి జుట్టు పట్టుకొని తలకాయ గోడకేసి కొట్టాడంట. అప్పట్నుంచి గోపి అంటే మండి పడుతున్నాడంట నీవు బడికి రావటానికి వీలులేదు అంటున్నాడంట'

'అందుకనే కామాలు మనం రోజూ బస్సు ఆపమని గొడవ చేస్తున్నా ఆపడం లేదు'

వెనుక సీట్లో రాణివాళ్లు గుసగుసలాడటం చూచి చాలమంది పిల్లలు మెల్లగా వాళ్లదగ్గరికి జేరారు

'ఈ సంగతులన్నీ మీకెట్లా తెలిశాయి?' అని రాణి అడిగింది.

'ఇదుగో, రంగడు—' అని రంగడ్ని చూపించింది మంగతాయారు

ఆ రంగడనేవాడికి గోపి అంటే తగని యిష్టం. ఇద్దరికి బాగా దోస్తీ. ఇద్దరూ ఒకే బెంచీలో కూర్చుంటారు. మూడు రోజులుగా గోపి బడికి రాక పోతుంటే వాడికేం తోచనట్లుంది పాపం! నిన్న సాయంత్రం స్కూలు వదిలిన తర్వాత గోపి కోసం గంగానమ్మ గుడి వయిపు వెళ్లాడు. గోపి కనిపించి ఏడుస్తూ అన్ని విషయాలూ చెప్పాడు.

మంగతాయారు, 'సీతయ్య అంతకు ముందు గోపీమీద చేయి వేశేవాడు కాదంట. మొన్నట్నుంచి రోజూ రాత్రుళ్లు బాగా తాగి గోపీని, వాళ్లమ్మనూ యిద్దరినీ కలిపి తంతున్నాడంట పాపం!' అని చెప్పింది.

ఈ మాటలు వినేసరికి కళ్లల్లోకి నీళ్లు తిరిగాయి

వాళ్లల్లోని ఒక నాపసాని పిల్ల సీతయ్య వయిపు తిరిగి మెటికలు విరుస్తూ, 'దొంగ సచ్చినోడు, వీడి చేతులు విరిగిపోను!' అని తిట్టింది.

ఈ వార్త మెల్ల మెల్లగా బస్సులోని మిగతా పిల్లలందరికి పాకిపోయింది. ఈ వార్తలోని విషయాలూ, వివరాలూ అర్థమయినవారికి అర్థమయ్యాయి; లేని వారికి లేదు మొత్తానికి అందరికీ అర్థమయిందీ, అందరూ గుసగుసలాడుకుంటున్నది ఏమిటంటే—'సీతయ్య సారా తాగుతాడు. రోజూ గోపిని, వాళ్లమ్మను తంతాడు'

ఇంతలో బస్సు రోడ్డుమీద ఒకచోట ఆగింది రోడ్డుమీద ఎదురుగా ఒక ఊరేగింపు పోతోంది. అందుకని రోడ్డు కటూ ఇటూ ట్రాఫిక్ ఆగిపోయింది. స్థానికంగా వున్న ఒక మిల్లులోని పనివారంతా సమ్మె చేసిన సందర్భంలో బయలుదేరి తీసిన ఊరేగింపు అది! వాళ్ల వేతనాలు పెంచాలని సమ్మె చేస్తున్నారు. ఇలా వాళ్లు సమ్మె చెయ్యటం ఈ సంవత్సరంలో యిది అప్పుడే మూడోసారి. ఆ మిల్లు 'బాలసదన్'కు దగ్గర్లోనే వుంది.

బస్సులోని పిల్లలకు ఈ ఊరేగింపు మీద, కార్మికులు చేసే నినాదాల మీద దృష్టి లేదు అంతా కలిసి గోపి విషయం గుసగుసలాడుకుంటున్నారు.

సీతయ్య బస్సును స్టార్టు చేసేముందు వెనక్కి తిరిగి చూశాడు పిల్లల గుసగుసలాగిపోయాయి పిల్లలు సీతయ్యను ఒక పెద్ద గజదొంగను చూసినట్లు చూశారు: సీతయ్యకు వీళ్ల వాలకం ఏమీ అర్థం కాలేదు.

'ఏంటి, అంతా వెనక్కు జేరారు? సరిగ్గా ఎవరి సీట్లల్లో వాళ్లు కూర్చోండి!' అని అంటూ బస్సును

ఖ్యాట్లు చేశాడు.

ఆ రోజు మధ్యాహ్నం భోజనాల సమయంలో పిల్లలంతా మొగాలు ముడ్చుకుని సీరియస్‌గా వున్నారు బస్సులో పెట్టిన భోజనం కారియర్లు సీతయ్య ఒక్కొక్కరిది తీసి పేరు పేరున అందిస్తుంటే మాటాడకుండా తీసికొని చెట్లక్రింద కెళ్ళారు.

సీతయ్యకూడ తన టిఫిన్ తీసుకుని రోజులాగా వాళ్ళతోపాటే కూర్చున్నాడు. ఎవరూ తనని పలకరించలేదు రోజూ అయితే, 'సీతయ్య, నీకూరేంటి? చేపల కూరా, ఛీ పాడు —', 'ఏమిటి. వుత్త పచ్చిమిరపకాయ అలా కొరుకుతున్నావు. కారం పుట్టదూ?', అన్నం నీవు వండావా, నీపెళ్ళాం వండిందా?' — ఇలా పిల్లలంతా తనతో చెప్తురాడేవారు తనుకూడ వాటికి దగ్గ కొంటె సమాధానాలు చెప్పి అందర్నీ నవ్వించేవాడు; తనుకూడ ఆ పిల్లలతోపాటు ఒక చిన్న పిల్లవాడయి మనసార హాయిగా నవ్వేవాడు.

అలాటిది ఈ రోజు పిల్లలందరూ బింకంగా వున్నారు. ఎవరూ తనతో మాటాడటం లేదు తనవంక మిర్రిమిర్రి చూస్తూ వున్నారు మధ్యలో ఎవరో చిన్న పిల్లవాడు తనని ఏదో అనబోతే మోహన్ 'ఏయ్' అని గద్దించాడు అంతటితో ఆ పిల్లవాడు కిక్కురు మనకుండా వూరుకున్నాడు. ఈ పిల్లల వాలకం తన కంతు పట్టకుండా వుంది ఇక తనే వుండబట్టలేక బ్రాహ్మణుల పిల్లయిన లీలను, 'అబ్బ. ఏమిటి చేపలవాసన వేస్తుంది? ఇవ్వాళ లీలమ్మ వుప్పు చేప ముక్క తెచ్చుకున్నట్లుందే!' అన్నాడు. లీల ఏదో సమాధానం చెప్ప బోయి రాణివంక చూచి ఆగిపోయింది

వీళ్ళందుకని తనని ఇలా వెలి వేస్తున్నారో సీతయ్య కర్థం కావటం లేదు ఆరోజు ఇంటర్‌వల్‌లో, 'సీతయ్యతో ఎవరూ మాటాడకూడద'ని ఆ పిల్లంముఠా అంతా తీర్మానించుకున్నట్లు సీతయ్యకు తెలియదు.

సీతయ్యకూడా మవునంగా అన్నం తింటూ కూర్చున్నాడు సీతయ్య కంత దూరంలో కూర్చున్న రాణి — మధ్యలో

# సవెంత్ర

'ఏం సీతయ్యా? మీ గోపిని చదివిస్తావా? చదివించవా?' అని అడిగింది.

రాణికంఠం సీతయ్యకు కొత్తగా వినిపించింది. నీ సంగతేమిటో అమీ తుమీ తేల్చేమే అన్న ధోరణిలో వుంది.

గోపి సంగతి ఎత్తేసరికి సీతయ్యకు వళ్ళు మండుకు వచ్చింది. మూడురోజుల క్రితం తనమీదకు వాడు పచ్చడి బండ నెత్తటం కళ్ళముందు మెదిలింది. వాడు తనని అన్నమాటలు గుర్తుకు వచ్చాయి. కోపంగా సీతయ్య పళ్ళు పటపట లాడించాడు కటువుగా ఏదో సమాధానం చెప్పదామనుకొని, మళ్ళీ ఏమనుకున్నాడో ఏమో మెల్లగా ఇలా అన్నాడు 'మీ కే చదివించు చదివించు అని కబుర్లు చెప్తారు వాడ్ని చదివించటానికి నాదగ్గర డబ్బులేవు —'

'మరి రోజూ సారా తాగటానికి డబ్బులు ఎక్కడ్నుంచి వస్తాయి?'

సీతయ్య నోటివరకెత్తిన అన్నంముద్ద నోటిదగ్గరె ఆగిపోయింది. ఆ మాట సూటిగా వెళ్ళి సీతయ్య గుండెలకు తగిలింది. తుపాకిదెబ్బ తిన్నట్లయింది. తను రోజూ సారా తాగుతాడని ఈ పిల్ల బొందల కెలా తెలిసింది?

'సీతయ్య సారా తాగుతాడు — సీతయ్య సారా తాగుతాడ'ని ఇద్దరు ముగ్గురు పిల్లలు కలిసి ఒకేసారి అన్నారు.

కొన్నిక్షణాలకు తనకు కలిగిన దిగ్భ్రాంతినుండి తేరుకున్నాడు ఈ గొట్టికాయలు తనను అనేవాళ్ళా అని కోపం వచ్చింది.

'సారా తాగుతే తాగుతా. మీ కేం బాధ?' అన్నాడు.

'తాగుతే తాగు. ఎవరొద్దన్నారు? గోపి నెందుకు తన్నటం?' అని అడిగింది రాణి.

ఈ విషయాలన్నీ వీళ్ళకెలా తెలిశాయి? ఆవెధవ యింటిదగ్గరె తనను అంటున్నది చాలక, ఈ పిల్లలచేత కూడ అనిపిస్తున్నాడు.

రాణి వంక చూచి, 'అడ్డా — అడ్డి —' సీతయ్య పళ్ళు పటపట కొరికాడు, 'ఆవెధవ వెలుడంత లేడు. ఆ కుంక పచ్చడి బండ తీసికొని నన్ను తన్నబోతాడా?' అన్నాడు.

'జొరంతో మంచంలో పడివున్న వాళ్ళమ్మను వుత్తపున్నేనికి నీవు తంతూవుంటె చూస్తూ వూరుకుంటాడా?' రాణి నవ్వుతూ అడిగింది.

'వూరుకోడు — వూరుకోడు. అడ్డు అసలు ఇరగతీసి పొయ్యిలో పెట్టాలి. ఆడదగ్గరెంత పొగరుంది? నీకేం తెలుసు? మీ యిళ్ళకాడా మీరంతా ఇట్లాగే చేస్తూ వున్నారా? మీ నాన్నలను తంతా మాటున్నారా?' తనని తాను సమర్థించుకునే ధోరణిలో అన్నాడు.

'మా నాన్నలు ఎవరూ నీలాగా సారా తాగరు' — ఒక్కసారిగా పది, పదిహేను కంఠాలు పలికాయి.

సీతయ్య రెండోసారి దెబ్బతిన్నాడు.

'అయితే గోపిని చదివించనంటావా? రోజూ బాగా సారాతాగి గోపిని, వాళ్ళమ్మనూ తంతానంటావు?'

'ఆడి మొగానికి తోడు చదువు కూడానా? సైకిలు షాపులో పెట్టా, సైకిళ్ళు తుడవటానికి అప్పుడుగాని వాడి రోగం కుదరదు —' అన్నాడు.

'అయితే నీకూ మాకూ పచ్చి!'

'పచ్చి' — 'పచ్చి' — 'పచ్చి'

'పచ్చి' 'పచ్చి' అని పిల్లలంతా గోలగోలగా అన్నారు.

సీతయ్యతేలిగ్గా నవ్వేసి, 'పొండర్రా!' అని అన్నాడు. ఇంతలో బడి గంట మ్రోగింది అంతా క్లాసులు కెళ్ళిపోయారు, హడావుడిగా.

సీతయ్య మధ్యలో ఆపిన అన్నం తినబోయాడు. ముద్ద నోటికెక్క లేదు. ఈ పిల్లలన్న మాటలన్నీ మాటి మాటికి చెవుల్లో వినిపిస్తున్నాయి. ఎదురుగా వున్న అన్నం సహించలేదు. తోకాడించుకుంటూ ఎదురుగా నిలబడిన నల్ల కుక్కకు మిగతా అన్నమంతా పడేశాడు.

ఆ సాయంత్రం స్కూలు అయిన తర్వాత బస్సు ఎక్కేటప్పుడు పిల్లలెవరూ తనతో మాటాడలేదు సీతయ్య అనలవాటు ప్రకారం చిట్టెమ్మను ఎత్తుకో బోయాడు. కాని చిట్టెమ్మ వాళ్ళ అక్కయ్య లక్ష్మి, చిట్టెని చేయి పట్టు

కుని ప్రక్కకు లాగింది.

సీతయ్య బరువుగా నిట్టూర్చి స్టీరింగ్ దగ్గరకెళ్ళి కూర్చున్నాడు. పసి పిల్ల ఈ చిట్టెమ్మకు కూడ పనికి రాకుండాపోయారే అని బాధపడ్డాడు. బస్సు ముందుకు కదిలింది.

...బస్సు, సమ్మె జరుగుతున్న మిల్లు దగ్గరకు వచ్చి ఆగిపోయింది. మిల్లుకు రెండు ప్రక్కల రోడ్డుమీద ట్రాఫిక్ ఆగిపోయింది. మిల్లు ముందు జనం గుమి కూడారు. రోడ్డుమీద సోడా సీసా పెంకులు, రాళ్ళు, కర్రముక్కలు పడి వున్నాయి. ఏం జరిగిందని సీతయ్య ఎవర్నో అడిగాడు. సమ్మె చేస్తున్న రెండు కార్మిక సంఘాల మధ్య తగాయిదా వచ్చి రెండు ముఠాలుగా చీలిపోయాయి. కొంత మంది పనుల్లోకి పోవటానికి కూడా ప్రయత్నించారు. ఆ రెండు ముఠాల వెనుక రెండు కార్మిక సంఘాల నాయకులు, మూడు రాజకీయ పార్టీలు, ఇద్దరు స్థానిక 'పెద్దమనుషులు' వున్నారు. ఫలితం—సోడాసీసాలు పగలటం తలకాయలు పగలటం, ఇలా రోడ్డుమీద ట్రాఫిక్, నిలిచిపోవటం.

అరగంట తర్వాతగాని సీతయ్య బస్సును ముందుకు పోనివ్వలేక పోయాడు.

రోజూ పిల్లలు వాళ్ళవాళ్ళ సెంటర్లో దిగి, బస్సు ముందుకు సాగుతుండగా 'సీతయ్యా, టాటా' అని చెప్పేవాళ్ళు. పిల్లలంతా రోజూ తనకు 'టాటా' చెప్పటం సీతయ్యకెంతో ఆనందంగా ఒక విధమైన గర్వంగా వుంటుంది. కాని, ఈ రోజు ఎవరూ సీతయ్యను పలకరించలేదు. చిట్టెమ్మ, 'టాటా' చెప్పబోతుంటే వాళ్ళక్కయ్య గదమాయించి చెయ్యిపట్టుకుని ముందుకు తీసికు పోయింది. సీతయ్యకు ఎంతో బాధ అనిపించింది.

ఆనాటి పిల్లల ప్రవర్తన, మాటలు మాటిమాటికి మనస్సులో మెదిలి మనస్సంతా కలవరపెట్టాయి. ఏదో భరించరాని వెలితి, దిగులు మనస్సును కుళ్ళ పొడుస్తున్నాయి. మనిషి పూర్తిగా డీలా పడిపోయాడు. బస్సును ఎలా తీసికెళ్ళి స్కూల్లో పెట్టాడో తనకే తెలియదు.

*


'మర్నాడు ఉదయం కూడ బస్సెక్కేటప్పుడు పిల్లలెవరూ సీతయ్యను పలకరించలేదు. పిళ్ళకే ఇంత బింకం వుంటే తనకేనా లేనిది అని అనుకుని సీతయ్య ఎవర్నీ పలకరించలేదు. గమ్మున తన పాటికి తాను బస్సు నడుపుతున్నాడు. అలా బింకంగా అనుకుంటానికి అనుకున్నా మనస్సు మాటిమాటికి పీకుతూనే వుంది.

మిల్లు ముందుకు వచ్చి బస్సు మళ్ళీ ఆగిపోయింది. మిల్లుముందు నానా గందరగోళంగా, అతి బీభత్సంగా వుంది. మిల్లు కాంటీన్‌లోని బల్లలు, కుర్చీలు ఎవరో తగులపెట్టారు. సగంసగం కాలిన హోటలు బల్లలు, కుర్చీలు మిల్లుముందు పడేశారు. పెట్రోలు పోసి మిల్లు గోడౌన్ తగులపెట్టారు. అది సగం కాలి, సగం ఆరి వుంది. ఒక కార్మిక సంఘం నాయకుని ఎవరో కత్తితో పొడిచారు. అతడు ప్రమాదస్థితిలో ఆసుపత్రిలోపడి వున్నాడు. మిల్లుముందు కొందరు కార్మికులు అంచెలువారీగా నిరాహారదీక్ష సాగిస్తున్నారు. మిల్లు ప్రక్కనవున్న ఖాసిం బడ్డీకొట్టును ఎవరో తిరగవేశారు; ఎదురుగా వున్న నాయర్ టీపాకను పీకేశారు. నాయర్, ఖాసింలు లబోదిబోమంటున్నారు. కార్మికులు పెడుతున్న సమ్మెలు ఈ అమాయకుల పొట్టమీద ఇలా కొట్టటానికిగల సంబంధాన్ని గురించి ఎవరూ ప్రశ్నించకూడదు. ప్రశ్నిస్తే వాడి బుర్ర పగిలిపోతుంది. అది అంతే!

ఎలాగయితేనేం ఆ ట్రాఫిక్ రద్దీలోంచి బయటపడి సీతయ్య బస్సు స్కూలు ఆవరణలోకి వచ్చి ఆగింది.

పిల్లలంతా వరుసగా కిందకు దిగుతున్నారు. చిట్టెమ్మ సంచీ భుజానకు తగిలించుకుని చిట్టి పొట్టి అడుగు లేస్తు కుంటూ మోడ ముచ్చటగా బస్సు దిగుతోంది. ఆ ప్రక్కనే నిలబడి బీడీ త్రాగుతున్న సీతయ్య చిట్టెమ్మ అలా బస్సు దిగటం చూశాడు. ఆ పిల్లమీద తనకున్న ప్రేమతో తన ప్రాణం కొట్టుకులాడింది. ఇక వుండబట్టలేక కాలుస్తున్న బీడీని అవతల పారేసి చిట్టెమ్మను ఆప్యాయతగా రెండు చేతులతో ఎత్తుకున్నాడు.

చిట్టెమ్మ తన కెవరూ ఏమీ చెప్పకుండానే, 'ఏద్దు, దింపు దింపు— నీవు మంచోడివి కావు. రోజా గొడవ తంతావు. నీ జత వచ్చి ఫో—' అని అంటూ సీతయ్య వంకలో నిలవకుండా సంజాయిషీ కిందకు జారిపోయింది.



సీతయ్య నిలువునా క్రుంగిపోయాడు. సీతయ్యను ఎవరైనా నడిబజార్లో పట్టుకుని మొగాన వుమ్మినా 'అంత అవమానం పొంది వుండడు; ఎదురుగా వచ్చి గుండెల్లో బాకు దింపినా అంత బాధ అనుభవించి వుండడు.

...మధ్యాహ్నం భోజనాల సమయంలో పిల్లలంతా మామూలు ప్రకారం చెట్ల క్రిందకు జేరారు. సీతయ్య బస్సులోంచి భోజనం టిఫిన్లు బయటికితీసి ఎవరి టిఫిన్ వాళ్ళ కిచ్చాడు.

అందరు వరుసగా టిఫిన్లు ముందు పెట్టుకుని కూర్చున్నారు. ఒకరి మొగాలు ఒకరు చూచుకుంటున్నారు కాని, టిఫిన్లు ఎవరూ తెరవటం లేదు.

అన్నాలు తినకుండా నిశ్శబ్దంగా కూర్చున్న పిల్లల్ని చూచేసరికి సీతయ్యకు ఆశ్చర్యమేసింది. రోజూ ఆవురావురుమని అన్నాలు తినే పిల్లలు ఈరోజు టిఫిన్ మూతలుకూడ విప్పకుండా అలా వూరికే ముందు పెట్టుకుని కూర్చున్నారు. మాటిమాటికి తనవంక మిరిమిరి చూస్తోన్నారు తనని ఒక రాక్షసుడ్ని చూస్తున్నట్టుగా చూస్తోన్నారు ఆ చూపులకు తట్టుకోలేక పోతున్నాడు. తనకు తెలియకుండానే మొదటిసారిగా ఒక నేరస్థుడిగా వాళ్ళ ముందు తలవంచాడు.

కొన్ని క్షణాల తర్వాత మెల్లగా, అలా కూర్చున్నారే, అన్నాలు తినండి!' అని అన్నాడు

'మేం తినం—'

'ఏం?'

'నీవు గోపిని బడికి రానివ్వాలి—'

'నీవు సారా తాగటం మానేయాలి—'

'అంతవరకు మేం మధ్యాహ్నపూట అన్నాలు తినం!'

'మీరంతా సత్యాగ్రహం చేస్తున్నారా?'

'అవును; మా గోపి కోసం—'

ఇలా సత్యాగ్రహం చేసి అన్నాలు తినటం మానేయాలని ఇందాక ఇంటర్వల్‌లో పిల్లలంతా నిర్ణయించుకున్నారు. దీనికి కథానాయకురాలు రాణి. ఆరోజు మొదటి పిరియడ్‌లో రాణి వాళ్ళ క్లాసులో పొట్టి శ్రీరాములు పాఠం చెప్పారు. ఆంధ్రరాష్ట్ర సాధనకు నిరాహార దీక్షబూని ఆత్మత్యాగం చేసిన ఆ

# సమెక్రి

నిస్వార్థజీవి వృత్తాంతం ఆ పిల్ల మనస్సులో నాటుకుపోయింది మనం ఏమైనా సాధించాలంటె అన్నం మానేసి నిరాహార దీక్ష బూనాలి అని అనుకుంది వెంటనే సీతయ్య, గోపి మనసులో మెదిలారు. ఆన ఆలోచన తమ ముఠాలో ముఖ్యమైన వారితో ఇందాక ఇంటర్వల్‌లో చెప్పింది; అందరూ సంప్రదించుకున్నారు.

దాని ఫలితమే ఈ సత్యాగ్రహం!

సీతయ్య తెచ్చి పెట్టుకున్న నవ్వు నవ్వాడు 'బాగుంది. ఆ వెధవగాడ్ని చదివించకపోతే మీకెందుకు, నేను సారాతాగితే మీకెందుకు? ఎందుకు కడుపులు మాడ్చుకుంటారు గాని, అన్నాలు తినండి —' అన్నాడు.

'అదంతా మాకు తెలియదు. మేం అన్నం తినం—అంతే!'

'తినం—', 'తినం—', 'తినం—' ముక్తకంఠంతో పలికారు.

సీతయ్య మనస్సు 'కుతుకుతు' కదులుతున్నాయి

'ఓహో, మీ వరస చాలా బాగుందే! నన్ను బెదిరిస్తున్నారా? తినకపోతె పోండి, నాకేం?' అన్నాడు బింకంగా, ఒక్కొక్క మాటనూ పేరుస్తూ, మనసులోని తడబాటును మాటల్లో తెలియనీయకుండా ప్రయత్నిస్తూ.

ఇంతలో గంట మ్రోగింది. అందరూ లేచారు అందరూ వరుసగా ప్లాస్టిక్ గ్లాసుల్లో పంపులో మంచినీళ్ళు పట్టుకుని త్రాగి కడుపులు నింపుకున్నారు.

చిట్టెమ్మ నీరసంగా, జాలిగ 'అన్నా ఆకలే!' అని అంది.

'ఫర్వాలేదు, మంచి నీళ్ళు తాగు'— అని వాళ్ళక్క మంచినీళ్ళ గ్లాసు అందించింది మధ్య మధ్యలో సీతయ్య వంక చూస్తూ మెల్ల మెల్లగా మంచినీళ్ళు త్రాగుతుంది.

ఆ పసిపిల్ల అలా కాళీ కడుపును మంచినీళ్ళతో నింపుకుంటుంటే సీతయ్య మనస్సు చివుక్కుమన్నది.

'ఏంటి రాణమ్మ మీ మొండితనం? ఆ పిల్లనన్నా అన్నం తిననీయండి!

చిట్టెమ్మతల్లి, నేను పెట్టుతా రావమ్మా' అని పిలిచాడు.

చిట్టెమ్మ మెల్లగా అడుగులో అడుగేసుకుంటూ వస్తుంది.

'మా తల్లి గాదె, మా తల్లి రావే!' అని సీతయ్య ఆప్యాయంగా చేతులు చాపాడు.

చిట్టెమ్మ, సీతయ్య దగ్గరగా వచ్చి, 'నాకేం వద్దు, నీ ఒత వచ్చి, ఫో—'అని తన చిన్నంగా వెంగును కుడిచేతిలో ఒక్క దులుపు దులిపి సీరియస్‌గా ముందు కెళ్ళిపోయింది.

పిల్లలంతా పకపక నవ్వారు సీతయ్య మొగంలో నెత్తురు చుక్క లేదు

'ఓ లబ్బ, నీ దగ్గరెంతవుందే మా అమ్మా!' అని అన్నాడు ఎలాగో మాటలు కూడదీసుకుంటూ.

పిల్లలందరు క్లాసు రూంలోకి వెళ్ళిపోయారు.

ఓహో, నన్ను బెదిరిస్తారా? అన్నాలు తినకుండా ఉన్నా తినకపోతే ఆకలి మీకేస్తుందా, నాకేస్తుందా మీరు తిన లేదని నేనెందు కన్నం మానేస్తాను. హాయిగా తింటాను — అని తన టిఫిన్ మూతలు మెల్లగా ఒకటొకటే తీశాడు. ఇంతలో అతని చూపులు అప్రయత్నంగా పిల్లలందరూ వదిలేసి వెళ్ళిన టిఫిన్ కారియర్లమీదకు మళ్ళాయి. అవన్నీ ఒక చోట పెట్టి వున్నాయి, నిస్వార్థమూ, నిర్మలమూ అయిన ఆ లేత మనసులకు ప్రతీకగా. సీతయ్యకు అన్నం మీదకు మనస్సు మళ్ళలేదు. మళ్ళీ టిఫిన్ మూతలు ఎలా తీశాడో అలాగే పెట్టేశాడు.

నాలుగ్గ్లాసుల మంచినీళ్ళు త్రాగి కడుపు నింపుకున్నాడు రోజూ అలవాటు ప్రకారం తలగుడ్డతీసి మామిడి చెట్టు క్రింద పరచి పడుకున్నాడు, చెట్టు కొమ్మల్ని ఆకుల్ని చూస్తూ ఆ చెట్టు చిటారుకొమ్మన ఒక కాకిగూడు వుంది. గూట్లో రెక్కలురాని రెండు కాకిపిల్లలున్నాయి తల్లికాకి గూడు చూచుకుంటూ పిల్ల కాకులను కనిపెట్టుకుని వుంది. ఇంతలో యింకో కాకి (మొగకాకి అయి వుంటుంది) నోట్లో ఏదో ఆహారాన్ని

కరచుకుని ఎక్కడ్నుంచో వచ్చింది. దాన్ని పిల్లకాకులకు, ఆడకాకికి పెట్టింది.

ఇదంతా చూస్తున్న సీతయ్యకు యింటిదగ్గర పెళ్లాంబిడ్డలు గుర్తుకు వచ్చారు. తను కాకికంటే హీనమయి పోయాడు. తన సంపాదనంతా సారా దుకాణాలకు పోస్తూ, పెళ్లాం కాయకష్టం చేసి సంపాదించి తెచ్చి రెండు పూటలా వండి పెడుతుంటే తిని కూర్చుంటున్నాడు. జ్వరంలో ముక్కుతూ మూల్గుతూవున్న పెళ్లాంను పట్టుకుని చావుదెబ్బలు కొట్టాడు, ఒకపూట అన్నం వండలేదని. అడ్డం వచ్చిన పిల్లవాడమీద పగపట్టాడు. ఇంటిదగ్గర సొంతపెళ్లాం బిడ్డల్ని వేపుకుని తింటుంది చాలక, ఈ పరాయి పసిపిల్లల్ని కూడా బాధ పెట్టుతున్నాడు. తన మూలంగా వీళ్లీపూట అన్నాలుకూడ మానేశారు.

సీతయ్యకు కంటిమీదకు కునుకు రాలేదు. లేచి రోడ్డుమీదకెళ్లి బీడీలు కొనుక్కొని వచ్చాడు. పాతగుడ్డ తీసికొని బస్సు తుడుస్తూ కూర్చున్నాడు. ఇంతలో గోపి క్లాసు మాష్టరు అటువయిపు వెళ్లుతూ సీతయ్యనుచూచి ఆగి, 'ఏం సీతయ్యా, మీ అబ్బాయి బడికి రావటం లేదే? వాడ్ని నీవు చదువు మానిపించావని అనుకుంటున్నట్లుగా విన్నాను. నిజమేనా? వాడు మంచి తెలివి కలవాడు. చక్కగా చదివించవయ్యా!' అని అన్నాడు.


సీతయ్య, 'చిత్తం, చిత్తం!' అని అన్నాడు. మాష్టరు బయటికి వెళ్లిపోయాడు.

నిజంగానే వాడెంతో తెలివి కలవాడు యింట్లో వాళ్లమ్మకు ఎంతో సహాయంగా వుంటాడు. తల్లి అంటె వాడికి తగని ప్రేమ. తన పెళ్లాం ఏడుస్తూ కూర్చుంటె వీడు దగ్గరకుజేరి కళ్లు తుడిచి వోదార్చి, నవ్విస్తూ వుండటం తను ఎన్నోసార్లు చూశాడు. తను రోజూ తాగివచ్చి తందానాలు ఆడుతున్నా, వాళ్లమ్మను తంతూవున్నా కిక్కురుమనకుండా ఒకమూల కూర్చుని తనపాటికి తాను చదువుకుంటూ కూర్చునేవాడు. అలాటివాడు మొన్న తన కెదురు తిరిగాడు. నాలుగు రోజులుగా జ్వరంతో తీసికుంటున్న తల్లిని చావుదెబ్బలు కొట్టుతూ వుంటె చూచి సహించలేకపోయివుండాలి. అందుకనే అలా తనమీదకు వచ్చాడు. తను నిజంగా వుత్త కసాయివాడు. ఈ కసాయితనం తనకెలా వచ్చినట్లు? ఆ తాగుడు మూలకంగానే! ఆ తాగిన మైకంలో తనకేమీ తెలియదు. ఈ పాడు అలవాటు మూలంగానే కదా ఈ పిల్లలందరికీ శత్రువును అయిపోయాను. అందరూ తనని ఈసడించుకుంటున్నారు. ఎప్పుడూ నా చంకలో ఎక్కి కేరింతలుకొట్టే చిట్టెమ్మ 'ఛీ—ఫో' అంటుంది. ఈ పిల్లల్లో ఎంతోమంది ధనవంతుల బిడ్డలున్నారు. పెద్ద పెద్ద ఆఫీసర్ల పిల్లలున్నారు. ఎందుకని ఈరోజు వీళ్లంతా అన్నాలు మానేశారు? వాళ్ల సావాసగాడికోసం సత్యాగ్రహం చేశారు. గోపిగాడిమీద ఆ పసికాయలు చూపిస్తున్న ప్రేమ, అభిమానం కన్నతండ్రిగా తాను చూపించలేకపోతున్నాడు తన కిన్నేళ్లు వచ్చాయి ఎందుకు, ఆ పిల్లలకున్న బుద్ధి తనకు లేకపోయింది. ఈ ముప్ఫైమంది పిల్లలు అంతకిముందు సీతయ్య, సీతయ్య అంటూ తనంటె ఎంతో ఇదిగా వుండేవాళ్లు, తనకీ చెడ్డ అలవాటు వుండబట్టి, తనలో పొల్లు వుండబట్టే కదా ఈరోజున తనను ఒక పురుగును చూస్తున్నట్లు చూస్తున్నారు. తనకీ అలవాటు వుందని తన స్నేహితులకు, బంధువులకు ఎందరికో తెలుసు. ఎవరైనా ఇది తప్పని చెప్పినవాడు, దీన్ని మాన్పించటానికి ప్రయత్నించిన వాడు వున్నాడా? ఈ పిల్లలకున్నపాటి బుద్ధి, జ్ఞానం పెద్దవాళ్లకు లేదు... సీతయ్య ఇలా ఆలోచిస్తూవుండగా బడిగంట కొట్టారు. పిల్లలంతా బిలబిలా బయటికి వచ్చారు. ఈ బస్సులో ఎక్కేవాళ్లు ఒక్కొక్కళ్లు తోటకూరకాడల్లా మొగాలు వేలాడేసుకుని నీరసంగా వస్తున్నారు. వాళ్లను చూడగానే సీతయ్య కడుపు చెరువయి పోయింది.

* * *

మర్నాడు 'బాలసదన్' బస్సు గంగానమ్మ గుడిదగ్గర ఆగటం ఆ బస్సులోని పిల్లలందరికీ ఎంతో ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించింది. ఆగిన బస్సులోకి కొత్తబట్టలతో, చిరునగవు మొగంతో ఎక్కిన గోపిని చూచేసరికి ఆ పసి హృదయాలు పట్టరాని ఆనందంతో గంతులేశాయి. అందరూ హుషారుగా కేరింతలు కొట్టారు.

గోపి చెప్పినదాన్నిబట్టి రాత్రి సీతయ్య సారాగిరా త్రాగకుండా యింటికి వచ్చాడు. తనకు కొత్తబట్టలు, మిఠాయి పొట్లాలు వాళ్లమ్మకు పూలు తీసికొచ్చాడు. తనని









ఏజెంట్లు: ది ట్రేడ్ ప్రమోటింగ్ కార్పొరేషన్
బకింగ్‌హాంపేట, విజయవాడ—2.




# సమ్మె

పిత్తుకుని ముద్దు పెట్టుకుని పిల్లల్ని కబుర్లో చెప్పాడు చచ్చినా ఈ జన్మలో యిక సారాగ్లాసు ముట్టనని వెంకటేశ్వర స్వామి పటంముందు ప్రమాణం చేశాడు.

బస్సు మిల్లు ముందుకు వచ్చి ఆగిపోయింది. మిల్లుముందు జనవాహన సమర్థంగా వుంది. అందువల్ల రోడ్డుమీద ట్రాఫిక్ కొద్దిసేపు ఆగిపోయింది. సీతయ్య ఇంజను ఆపుచేసి వెనక్కితిరిగి రాణీవాళ్ల వంకచూచి నవ్వాడు బదులుగా వాళ్లూ మనసారా నిండుగా నవ్వారు ఆ నవ్వులో ఆ పసి హృదయాలల్లోని నిర్మలత్వం నిస్వార్థత్వం వెల్లి విరిశాయి.

పిల్లలందరూ 'సీతయ్య!' 'సీతయ్య!' అని స్నేహపూరితంగా పిలిచారు. నిస్వార్థంతోనూ, నిర్మలాంతఃకరణతో ఆ పసివాళ్లు తలపెట్టిన సత్యాగ్రహం సీతయ్య ఒక మనిషిగా మారినతర్వాత, వాళ్ల సంసారం కుదుటబడిన తర్వాత, ఆగిపోయిన గోపి చదువు కొనసాగింపబడిన తర్వాత, అలా విరమించబడింది.

ఆ మిల్లు కార్మికులు సమ్మెకూడ ఆరోజు వుదయమే విరమించబడింది — ఎంతోమంది కార్మికుల తలకాయలు పగిలిన తర్వాత, ఒక కార్మిక నాయకుడు శాశ్వతంగా అవిటి వాడయిన తర్వాత, మిల్లు యాజమాన్యానికి రెండులక్షల ఆస్తి నష్టమయిన తర్వాత దేశ పారిశ్రామిక వుత్పత్తి కొన్ని లక్షలమేరకు దెబ్బ తిన్న తర్వాత, యజమాన్యానికి అనుకూలంగా లాభసాటిగా రాజీకుదిర్చిన పెద్దమనుషుల జేబులు బరువుతో నిండిన తర్వాత, అంచెలువారీగా నిరాహారదీక్ష (చాటుమాటుగా తిన్న యిడ్లీలు, పెసరట్లు లెక్కలోనికి రావు) సాగిస్తున్న సత్యాగ్రాహకులు నిమ్మకాయరసం పుచ్చుకున్న తర్వాత, ఈ సమ్మెకేవిధంగానూ సమ్మంధంలేని ఖాసిం, నాయర్లు నెత్తిమీద గుడ్డేసుకున్న తర్వాత, మిల్లు కార్మికుల స్థితి గొర్రెతోక లాగానే మిగిలిన తర్వాత.

ట్రాఫిక్ రద్దీ తగ్గినతర్వాత 'బాల సదన్' బస్సుస్కూలు వయిపు పరుగెత్తింది. ●